AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

ఐకేపీ సిబ్బందికి శిక్షణ

3

2

విద్యుత్‌శాఖ ఏఈకి పురస్కారం

ఏసీపీ రాజా వెంకటరెడ్డి బదిలీ..కొత్త ఏసీపీగా ప్రకాష్

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: నిజామాబాద్ ఏసీపీగా పనిచేస్తున్న ఎల్ రాజా వెంకటరెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రాజా వెంకట్ రెడ్డి 2024 ఫిబ్రవరి 16న నిజామాబాద్ ఏసీపీగా ఛార్జ్ తీసుకున్నారు. కాగా.. ఆయన స్థానంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్‌బీ ఏసీపీగా పని చేస్తున్న బి.ప్రకాష్ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిని హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్

అక్షరటుడే, బోధన్: మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి బోధన్‌లో పర్యటించారు. పట్టణంలోని విజయ మేరీ హైస్కూల్‌లో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం బోధన్ మున్సిపాలిటీకి సంబంధించిన ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం పాఠశాలలో గదులను ఆమె తనిఖీ చేశారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఇతర అధికారులతో డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సాఫీగా జరిగేలా, అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రిపోలింగ్‌కు ఆస్కారం ఉండకూడదన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ విఠల్, సంబంధిత అధికారులు ఉన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ..

బోధన్ మండలంలోని అమ్దాపూర్‌లోని బాలికల పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక వసతులు.. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాలను, వసతిని కల్పించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో కావాల్సిన వసతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు సంబంధించిన మరమ్మతులను త్వరలోనే పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌తో పాటు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మాహతో, డీఈవో అశోక్ తదితరులున్నారు.

పురపోరుకు వేళాయె..

మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం ఆసన్నమైంది. మంగళవారం సాయంత్రం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 11న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపింది. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు ఆయా మున్సిపల్ కేంద్రాలకు చేరుకోగా అధికారుల నియామకాన్ని పూర్తి చేశారు.

- అక్షరటుడే, కామారెడ్డి

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఫిబ్రవరి 11న ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికారులు
- ప్రచారం జోరు పెంచిన ఆశావహులు

ఉమ్మడి జిల్లాలో మొత్తం ఏడు మున్సిపాలిటీలతోపాటు నిజామాబాద్ నగరపాలక సంస్థ లో ఈనెల 11న ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 4,92,920 మంది ఓటర్లు ఉండగా ఇందులో నిజామాబాద్‌లో 3,44,756, ఆర్మూర్లో 64,165, బోధనలో 69,810, భీమ్‌గల్‌లో 14,189 మంది ఓటర్లు ఉన్నారు.

కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలో మొత్తం 1,49,525 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో కామారెడ్డిలో 99,313 మంది, ఎల్లారెడ్డి లో 13,265 మంది, బాన్సువాడలో 24188 మంది, బిచ్కుంద లో 12,759 మంది ఓటర్లు ఉన్నారు. కామారెడ్డిలో 49 వార్డులు ఉండగా 152 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 17 మంది రిటర్నింగ్ అధికారులు, 17 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 13 మంది నోడల్ అధికారులను నియమించారు. బాన్సువాడలో 19 వార్డుల్లో 39 పోలింగ్ కేంద్రాల, 9 మంది రిటర్నింగ్, 9 మంది ఏఆర్‌వో, నలుగురు నోడల్ అధికారులు, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీలో 12 చొప్పున వార్డులు ఉండగా.. 24 పోలింగ్ కేంద్రాలు, ఐదుగురు రిటర్నింగ్, ఐదుగురు అసిస్టెంట్ రిటర్నింగ్, ముగ్గురు నోడల్ అధికారుల చొప్పున నియమించారు.

పార్టీల్లో కోలాహలం..

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రధాన పార్టీల్లో కోలాహలం మొదలైంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలో ఆశావహులు తమ దరఖాస్తులను అందజేశారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలలో ఆశావహులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఒక్కో వార్డుకు సుమారు 10 నుంచి 15 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. సీనియర్లతో పాటు కొత్తవారు పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు.

హోరాహోరీగా..

నిజామాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఈ సారి ఎన్నికలు హోరాహోరీగా సాగనున్నాయి. ప్రధానంగా బీజేపీ, బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్ పార్టీల మధ్య త్రిముఖ పోరు సాగనుంది. ఇప్పటికే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన ఆయా పార్టీలు అభ్యర్థులను మాత్రం ఖరారు చేయలేదు. ఒక్కో వార్డుకు పదుల సంఖ్యలో దరఖాస్తులు రాగా ఎంపిక మాత్రం ఇంకా పూర్తి చేయలేదు. తాజాగా షెడ్యూల్ విడుదల కావడంతో ఒకటి, రెండు రోజుల్లో అన్ని పార్టీలు అభ్యర్థుల పేరు ప్రకటించనున్నాయి. మరోవైపు కొంతమంది టికెట్ పక్కా అనుకునే అభ్యర్థులకు వార్డుల్లో ప్రచారం చేసుకోవాల్సిందిగా నాయకులు సూచించినట్టుగా తెలుస్తోంది.

ఇంటింటికీ ఇప్పటి నుంచే గిఫ్టులు..

కామారెడ్డి జిల్లాలో ఇప్పటికే వార్డుల్లో ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రజల్లో ఉంటున్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపడుతున్నారు. పలు వార్డుల్లో ఆశావహులు ఓటర్లకు ఇంటింటికీ గిఫ్టులు కూడా పంపిణీ చేసినట్లుగా తెలుస్తోంది.

నిజామాబాద్ జిల్లాలో..

మున్సిపాలిటీ	వార్డులు
ఆర్మూర్	36
బోధన్	38
భీమ్‌గల్	12
నిజామాబాద్ కార్పొరేషన్	60 డివిజన్లు

కామారెడ్డి జిల్లాలో..

మున్సిపాలిటీలు	వార్డులు
కామారెడ్డి	49
బాన్సువాడ	19
ఎల్లారెడ్డి	12
బిచ్కుంద	12

ముఖ్యమైన తేదీలు

- ఈ నెల 28 తేదిన నోటిఫికేషన్ విడుదల.
- ఈ నెల 28వ తేది నుంచి 30 వరకు నామినేషన్లు స్వీకరణ
- 31న నామినేషన్ల పరిశీలన
- ఫిబ్రవరి 03న ఉపసంహరణ
- ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు
- 13న కౌంటింగ్
- 16వ తేదీన మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎన్నిక

భీమ్‌గల్‌లో అభివృద్ధి పనుల జోరు

అక్షరటుడే, భీమ్‌గల్: భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. టీయూఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన రూ.11.50 కోట్ల నిధులతో మంగళవారం పట్టణంలోని 6వ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు కల్వర్టుల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు నాయకులు తెలిపారు. తమ వార్డులో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న డ్రెయినేజీ రోడ్ల సమస్యలను గుర్తించి, నిధులు మంజూరు చేయించినందుకు 6వ వార్డు మహిళలు ముత్యాల సునీల్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో పనులు జరగక ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పనులు ప్రారంభం కావడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొదిరే స్వామి, నాయకులు లింబాద్రి, నవీన్, దినేష్, శ్రీకాంత్, చిన్నయ్య, తోట చిన్న గంగారం, రాహుల్, లక్ష్మణ్ పాల్గొన్నారు. అలాగే వార్డు మహిళలు నీలం లస్మాయి, శారద, నర్సు, బొదిరే గంగా నర్సు, గంగు, రాజగంగు, గంగం గంగు, బొదిరే నాగమణి పనులను ప్రారంభించారు.

కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పోటీ

అక్షరటుడే, కామారెడ్డి: ప్రస్తుతం జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కామారెడ్డి మున్సిపాలిటీలో జనసేన పోటీ చేస్తుందని ఆ పార్టీ కామారెడ్డి నాయకుడు లక్ష్మీనర్సాగౌడ్ తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో మంగళవారం పలువురు అభ్యర్థులు జనసేన పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జనసేన పార్టీ చీఫ్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచన మేరకు తెలంగాణలో జనసేన పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తుందన్నారు. కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో 15 నుంచి 16 వార్డుల్లో జనసేన పోటీలో ఉంటుందని, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు గట్టి పోటీ ఇస్తుందని తెలిపారు. వార్డుల్లో సమస్యలు తెలుసుకుని మేనిఫెస్టో తయారు చేస్తామని తెలిపారు. కొండగట్టుకు పవన్ కళ్యాణ్ విరాళం ప్రకటించిన తర్వాత తెలంగాణలో పార్టీకి బలం పెరిగిందని, పార్టీపై ప్రజలకు నమ్మకం ఏర్పడిందన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీలో 9 వార్డుల్లో అభ్యర్థుల ఎంపిక పూర్తయిందని, పోటీచేసే అభ్యర్థులను గెలిపించుకుని పవన్ కళ్యాణ్‌కు గిఫ్ట్ ఇస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీకి షాక్‌లు తగులుతున్నాయని, ఆ పార్టీల నుంచి జనసేనలోకి వలసలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కామారెడ్డిలో జనసేన పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, రవి, శరత్, మల్లేశం, జీవన్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలకే ముప్పు

అక్షరటుడే, కోటగిరి: బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించకపోతే ప్రాణాలకే ముప్పు పొంచి ఉంటుందని ఎస్సై సునీల్ పేర్కొన్నారు. యువత హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ, ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. 'అరైవ్..అలైవ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోటగిరి మండలంలోని బస్వాపూర్, (గన్నారం) చౌరస్తా నుంచి లింగాపూర్ గ్రామపంచాయతీ వరకు వాహనదారులు హెల్మెట్లను ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గన్నారం సర్పంచ్ దేగాం హన్మంత్ సహకారంతో ఎస్సై చేతుల మీదగా వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కారులో ప్రయాణం చేసేటప్పుడు కచ్చితంగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో లింగాపూర్ సర్పంచ్ దొడ్డిమీది శారద రాజేశ్వర్, ఉప సర్పంచ్‌లు దేగాం భూమయ్య, అన్నపూర్ణ మోహన్, పంచాయతీ కార్యదర్శి, రాజు, వాహనదారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'భరోసా కేంద్రం'

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: పోక్సో, ఇతర కేసుల్లో బాధిత మహిళలకు అండగా భరోసా కేంద్రం నిలుస్తోందని అడిషనల్ డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి అన్నారు. నగరంలోని వినాయక్‌నగర్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో భరోసా కేంద్రం ప్రథమ వార్షికోత్సవానికి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బస్వారెడ్డి మాట్లాడుతూ.. భరోసా కేంద్రాల్లో బాధిత చిన్నారుల భద్రతకే కాకుండా వారిలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు పనిచేస్తున్నాయన్నారు. అలాగే పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ, పిల్లల హక్కులను కాపాడడమే ఈ చట్టం ఉద్దేశమని వివరించారు. పిల్లలు తమపై జరుగుతున్న అన్యాయాలను భయంతో దాచుకోకుండా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ గురించి వివరించారు. లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని క్రమశిక్షణతో కష్టపడి చదువు ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. పిల్లల భద్రతతో పాటు వారి భవిష్యత్తు నిర్మాణం కూడా ముఖ్యమని, ఇందులో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం మొత్తం కలిసినప్పుడే సానుకూల మార్పు సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం అనంతరం భరోసా కేంద్రం ఒకటో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమానికి ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, ఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్ రెడ్డి, నాల్గో టౌన్ సీఐ సతీష్, భరోసా కేంద్ర కో-ఆర్డినేటర్ రోజా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

మున్సిపల్ ఎన్నికలను సాఫీగా నిర్వహించాలి

అక్షరటుడే, ఇందూరు: మున్సిపల్ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా సాఫీగా జరిపించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డిలతో కలిసి మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలయ్యేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జిల్లాలో నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లాలో నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలో ఎన్నికలు ఉన్నాయని, మొత్తం 146 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల కమిషనర్ దృష్టికి తెచ్చారు. బుధవారం నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు వీలుగా ఆయా మున్సిపాలిటీల పరిధిలో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నోడల్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని తెలిపారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, కామారెడ్డి ఇన్చార్జి అదనపు కలెక్టర్ మధుసూదన్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, కిరణ్మయి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ సిబ్బందికి శిక్షణ

అక్షరటుడే, బాల్కొండ: మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాలకు చెందిన ఐకేపీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డీఆర్డీవో మధుసూదన్ హాజరై, బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు, రికవరీ ప్రక్రియ, కొత్తగా సంఘాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ఐకేపీ కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. సమావేశంలో డీపీఎంలు సంధ్య రాణి, నీలిమ, కిరణ్ కుమార్, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ రాందాస్, ఏపీఎంలు గంగారాం, శ్యాం పాల్గొన్నారు.

సీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం

అక్షరటుడే, ఇందూరు: నగరంలోని సీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యుడు ముఖేష్ ఆధ్వర్యంలో సుమారు 290 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అనంతరం వారికి ఉచితంగా మందులు, పేస్ట్‌లు అందజేశారు. అనంతరం దంత రక్షణపై వారికి అవగాహన కల్పించారు. దంతాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే దంతవైద్యుడిని సంప్రదించాలని.. నిర్లక్ష్యం చేస్తే సమస్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనునాయక్ డెంటల్ ఆస్పత్రి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

అక్షరటుడే, ముప్కాల్: మండలంలోని నల్లూరు గ్రామానికి చెందిన బర్కం పెద్ద భోజన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన బండి రాజేశ్వర్ కుమార్తె సాత్విక ఇటీవల మృతి చెందగా.. ఆ కుటుంబాన్ని కూడా ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నల్లూరు సర్పంచ్ బర్కం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ యాదగిరి వర్ధంతి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

అక్షరటుడే, ఆర్మూర్: జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 1న నిర్వహించనున్న కామ్రేడ్ యాదగిరి ప్రథమ వర్ధంతి సభను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు దేవారం, ముత్తెన్నలు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆర్మూర్‌లోని కుమార్ నారాయణ భవన్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని గాయత్రి నగర్ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో వర్ధంతి సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి బి.కిషన్, నాయకులు ఏపీ గంగన్న, రాజన్న, శేఖర్, ఠాకూర్, గంగాధర్, దుర్గా ప్రసాద్, పద్మ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వారు నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు.. పదవి దక్కగానే బాధ్యతను మరవలేదు. గ్రామ అభివృద్ధికి ముఖద్వారమైన విద్యాలయాన్ని బాగు చేయాలని సంకల్పించారు. తాము చదువుకున్న, ఊరి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బడిపై మమకారాన్ని చాటుకున్నారు. అందరూ ఒక్కటై, నిరుపేద విద్యార్థులు చదువుకునే రేకులపల్లి ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిచారు.

- అక్షరటుడే, భీమ్‌గల్(ధర్పల్లి)

అక్షర దేవాలయానికి అండగా నిలిచి..

- పాఠశాల రుణం తీర్చుకున్న ప్రజాప్రతినిధులు
- సొంత నిధులతో బడికి కొత్త హంగులు అద్దిన పాలకవర్గం
- రేకులపల్లి ప్రాథమిక పాఠశాల రూపురేఖలు మార్చిన వైనం

ధర్పల్లి మండలంలోని రేకులపల్లి గ్రామానికి చెందిన నూతన గ్రామ పంచాయతీ పాలకవర్గం పాఠశాల అభివృద్ధికి బాటలు వేసింది. సర్పంచ్ రాజేందర్, ఉప సర్పంచ్ చంద్రశేఖర్ నేతృత్వంలో 10 మంది వార్డు సభ్యులు తమ వంతు బాధ్యతగా పాఠశాలకు కొత్త రూపునిచ్చారు. పాఠశాల భవనానికి ఆకర్షణీయమైన రంగులు వేయించి, ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు.

భాగస్వాములైన వారు వీరే..

వార్డు సభ్యులు కరుణాసాగర్, సుమలత, వనిత, సత్యనారాయణ, లత, సావిత్రి, దాసు గౌడ్, ధర్పల్లి గంగాధర్, మహిపాల్ కలిసి ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. 'కన్నతల్లి లాంటి ఊరు, చదువు చెప్పిన బడి రుణం తీర్చుకోవడం మా అదృష్టం' అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల హర్షం..

పాఠశాల రూపురేఖలు మార్చి, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించినందుకు పాఠశాల హెచ్ఎం అంకం నరేష్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసింది. పాలకవర్గ సభ్యుల చొరవను కొనియాడుతూ ఉపాధ్యాయులు శ్రావ్య, గంగాదాస్, సవిత, చందన గ్రామపంచాయతీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజాప్రతినిధుల సమిష్టి కృషి ఉంటే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో నడుస్తాయని ఈ ఘటన నిరూపించింది.

విద్యార్థిని కుటుంబానికి పరిహారం చెల్లించాలి

అక్షరటుడే, బాన్సువాడ: ఆటోలో నుంచి పడి మృతి చెందిన విద్యార్థిని సంగీత కుటుంబానికి ప్రిన్సిపాల్ రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాన్సువాడ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వామపక్ష విద్యార్థి సంఘాలు నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బోర్లం బాలికల గురుకులంలో 8వ తరగతి విద్యార్థిని సంగీత మృతి చెంది నేటికి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటికి ప్రిన్సిపాల్ సునీతను అరెస్ట్ చేయకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థినులను సంగీతను ప్రిన్సిపాల్ వ్యక్తిగత పనుల కోసం తీసుకెళ్లడం వల్లే ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. విద్యార్థిని కుటుంబానికి ప్రిన్సిపాల్ రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థిని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సమావేశంలో పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘురామ్ నాయక్, టీఎస్ పీ జిల్లా అధ్యక్షుడు మావురం శ్రీకాంత్, డీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జీవన్ రాథోడ్, నాయకులు కుషాల్, రమేష్, మైపాల్, సాయి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అక్షరటుడే, ఆర్మూర్: మాక్లూర్ మండలంలోని ధర్మోరా గ్రామంలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ పందిరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ గొల్ల నాగేష్ ప్రారంభించారు. ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సహకారంతో ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన నిధులతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు సర్పంచ్ తెలిపారు. అలాగే గ్రామంలోని మహాలక్ష్మి ఆలయం నుంచి ఆరో వార్డు వరకు సీసీ రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సంతోష్ కుమార్, వార్డు సభ్యులు గంధం పెద్ద సాయిలు, జమున, దివ్య, కళ్యాణి, సునీత, లక్ష్మి, సుంకరి భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈకి పురస్కారం

అక్షరటుడే, ఇందూరు : విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందిస్తున్న సబ్ స్టేషన్లకు ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఉత్తమ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా నగరంలోని వినాయక్‌నగర్ డీ ఫోర్ సెక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్ పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి డీ-ఫోర్ సెక్షన్ సబ్ స్టేషన్ ఏఈ గంగాశేఖర్‌కు ఫర్మార్మర్ ఆఫ్ ద ఇయర్-2025 పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఈ గంగాశేఖర్‌ను సెక్షన్ సిబ్బంది మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ లక్ష్మణ్, లైన్ ఇన్‌స్పెక్టర్లు రఘునందన్, భోజన్న, సబ్ ఇంజినీర్ నగ్మా, లైన్‌మెన్లు విజయ్, నర్సయ్య, రవి, శ్రీనివాస్, ఫకీరా, అసిస్టెంట్ లైన్‌మెన్లు ప్రసాద్, విజయ్, సాయన్న, జేఎల్ఎం సుమన్ తదితరులు పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ముఖ్యం

అక్షరటుడే, బాన్సువాడ: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ రమణ అన్నారు. బాన్సువాడ పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షా కాలంలో విద్యార్థులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని, పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనవ్వకుండా ముందస్తుగా సిద్ధమవ్వాలని సూచించారు. టీనేజ్ దశలో వచ్చే ఆకర్షణలకు లోనవ్వకుండా చదువుపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని చదివితే విజయం తప్పకుండా సొంతమవుతుందని తెలిపారు. ఏవైనా కారణాల వల్ల చదువులో వెనుకబడిన వారు లేదా తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు నిరాశ చెందకుండా మళ్లీ ప్రయత్నించాలన్నారు. మొబైల్ వినియోగంపై అధికంగా దృష్టి పెట్టకుండా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సబ్జెక్టుల్లో వచ్చే సందేహాలను ఉపాధ్యాయుల సహాయంతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. రోజు యోగా, మెడిటేషన్ చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభించి చదువులో మరింత ప్రగతి సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయభారతి, జిల్లా సోషల్ వర్కర్ రాహుల్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు దయానంద్, ఆయేషా రఫత్, సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీ, శోభ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: డ్రంకన్ డ్రైవ్‌లో ఇద్దరికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ఈ మేరకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ వివరాలు వెల్లడించారు. ఈనెల 27వ తేదీన ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో 23 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లుగా గుర్తించారు. వారిపై కేసులు నమోదు చేసి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. ఈ సందర్భంగా వారిని విచారించిన న్యాయమూర్తి ఇద్దరికి జైలుశిక్ష విధించారు. అలాగే 21మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారని ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు.

పట్టణ ప్రగతిపైనే ఓటరు చూపు..!

నిజామాబాద్ జిల్లాలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన పట్టణం భీమ్‌గల్. గడిచిన కొన్నేళ్లుగా పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన ఈ పట్టణం ఇప్పుడు మరో ఎన్నికల సమరానికి సిద్ధమవుతోంది. రాజకీయ చైతన్యం మెండుగా ఉన్న ఈ గడ్డపై గులాబీ, కాషాయం, హస్తం పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి.

- అక్షరటుడే, భీమ్‌గల్

- మున్సిపల్ పోరుకు షెడ్యూల్ విడుదల
- 'భీమ్‌గల్'లో త్రిముఖ పోరు తప్పదా?

పురాతన కోటల నుంచి పురపాలిక వరకు భీమ్‌గల్ పట్టణానికి ఘనమైన చరిత్ర ఉంది. 10వ శతాబ్దంలో రాష్ట్రకూటుల కాలంలో నిర్మించిన రామాలయం, నందీశ్వరాలయం పట్టణానికి తలమానికం. కాకతీయులు, చాళుక్యుల పాలనలో ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా విరాజిల్లింది. ప్రసిద్ధ లింబాద్రి గుట్ట నృసింహస్వామి ఆలయం భీమ్‌గల్ వాసుల ఆరాధ్య దైవం. ఒకప్పుడు గిరిజన ప్రాంతాలకు ముఖద్వారంగా ఉన్న ఈ గ్రామం, అభివృద్ధి పథంలో సాగి మున్సిపాలిటీ స్థాయికి చేరింది.

2018లో మున్సిపాలిటీగా..

గ్రామ పంచాయతీగా ఉన్న భీమ్‌గల్‌ను ప్రభుత్వం 2018 ఆగస్టు 2న పురపాలికగా అప్‌గ్రేడ్ చేసింది. మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో (2020) మల్లెల రాజశ్రీ, కన్నె ప్రేమలత (బీఆర్ఎస్) భీమ్‌గల్ మున్సిపాలిటీకి మొదటి చైర్‌పర్సన్‌గా ఎన్నికై చరిత్ర సృష్టించారు. వైస్ ఛైర్మన్‌గా గున్నాల బాల భగత్ బాధ్యతలు చేపట్టారు.

వార్డుల విభజన: ఈ పురపాలికను మొత్తం 12 వార్డులుగా విభజించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం భీమ్‌గల్ జనాభా సుమారు 15,446 ఉండగా, ప్రస్తుతం అది 20 వేలకు పైగా చేరుకున్నట్లు అంచనా. సుమారు 11,900 నుంచి 12,000 మంది ఓటర్లు పట్టణ భవిష్యత్తును నిర్ణయించనున్నారు. వీరిలో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య స్వల్పంగా ఎక్కువగా ఉండడం గమనార్హం.

పట్టణంలోని ప్రధాన సమస్యలివే..

మున్సిపాలిటీగా మారినప్పటికీ పూర్తిస్థాయిలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడాల్సి ఉంది. తాగునీటి సరఫరా మెరుగైనప్పటికీ, అంతర్గత రోడ్ల విస్తరణ, పార్కుల ఏర్పాటు, వంద ప్రజల నిర్మాణం పూర్తి చేయడం, సమీకృత మార్కెట్ భవనం పూర్తి చేయడం తదితర అంశాలపై ప్రజలు దృష్టి సారిస్తున్నారు.

త్రిముఖ పోరు తప్పదా?

రాబోయే ఎన్నికల్లో భీమ్‌గల్ రాజకీయ చిత్రం ఆసక్తికరంగా మారనుంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేయగా, ఇప్పుడు సమీకరణాలు మారాయి. గత ఐదేళ్ల అభివృద్ధి పనులను (వైకుంఠధామాలు, సెంట్రల్ లైటింగ్) ప్రధాన రహదారుల నిర్మాణం, వంద పడకల ఆస్పత్రి, సమీకృత మార్కెట్ తదితర అభివృద్ధి పనులు చూపి ఓట్లు అడగాలని భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండడం, సంక్షేమ పథకాల అమలు తమకు కలిసి వస్తుందని హస్తం పార్టీ ధీమాతో ఉంది. పట్టణ ఓటర్లలో బీజేపీకి మంచి పట్టు ఉండడంతో, గతంలో రెండో స్థానంలో నిలిచిన వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. మున్సిపాలిటీలో సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీ ఓటర్లు అత్యంత కీలకం. ఛైర్‌పర్సన్ రిజర్వేషన్ ఎవరికి దక్కుతుందనే దానిపై అభ్యర్థుల ఆశలు ఆధారపడి ఉన్నాయి. మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి మంత్రం పని చేస్తుందా? లేక రాజకీయ మార్పును భీమ్‌గల్ ఆహ్వానిస్తుందా? తెలియాలంటే ఫిబ్రవరి 13వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.